క్లుప్తంగా

స్థానికులతోనే పోస్టులు భర్తీ చేయాలి



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంతాల పోస్టులను స్థానిక గిరిజన అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంగళవారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్‌కు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్‌రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్‌నాయక్ మాట్లాడుతూ.. ఏజెన్సీ డీఎస్సీ, జనరల్ డీఎస్సీగా వర్గీకరించి నోటిఫికేషన్లు ఇవ్వాలని, షెడ్యూల్డ్ ఏరియాల్లో ఎస్టీలకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం కొత్తగూడెం మున్సిపాలిటీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నర్మద మంగళవారం తెలిపారు. పాతకొత్తగూడెం, గౌతంనగర్, సింగరేణి ప్రధాన ఆస్పత్రి ఏరియా, భజనమందిర్ ఏరియా, మేదరబస్తీ, ఎంజీ రోడ్, కూలీలైన్ ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. అదేవిధంగా ఎ పవర్‌హౌస్ బస్తీ, ఫ్యూన్‌బస్తీ, గంగాబిషన్‌బస్తీ, ఎస్‌సీబీ నగర్, గరిమెళ్లపాడు ప్రాంతాలలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని కొత్తగూడెం విద్యుత్ ఏడీఈ హేమచంద్రబాబు తెలిపారు.

విద్యుత్‌లైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

జూలూరుపాడు: కాకర్ల – అనంతారం గ్రామాల మధ్య మొద్దులగూడెం గ్రామానికి వెళ్లే దారి పక్కన ఉన్న వ్యవసాయ పొలాల్లోని ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు మరమ్మతులు చేశారు. సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ప్రమాదకరంగా విద్యుత్‌లైన్ అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ కుమార్ సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు. ఈ మేరకు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కేసులు తొలగించాలి..

సింగరేణి(కొత్తగూడెం): పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి తదితరులపై నమోదు చేసిన పూసపెల్లి కుట్ర కేసులను ఎత్తివేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సింగు ఉపేందర్ మాట్లాడుతూ.. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు, మరికొందరు విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు. ఇకనైనా కేసులు తొలగించాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.సాంబ, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం, కాంపాటి పృథ్వీ, ఎట్టి ప్రశాంత్, బయ్యా అభిమన్యు పాల్గొన్నారు.

కిష్టారం ఓసీ సందర్శన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని కిష్టారం ఓసీని మంగళవారం మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాల్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ కత్తుల తరుణ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఎన్విరాల్‌మెంట్ కండిషన్స్‌ను పరిశీలించారు. అనంతరం ఏరియా అధికారులు పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి విచారించారు. ఏరియా జీఎం శాలేంరాజు, ఎన్విరాల్‌మెంట్ జీఎం జేవీఎల్ గణపతి, కిష్టారం ఓసీ ఆఫీసర్ వి.నర్సింహారావు, టి.సత్యానారాయణ, రవికిరణ్, సీహెచ్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ మేనేజర్ రామకృష్ణ, ఇంజనీర్ రమణారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



లచ్చసాధు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: టేకులపల్లికి చెందిన తోటకూరి అనంతమ్మ(95) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె మృతదేహం వద్ద ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే, మండలంలోని తూర్పుగూడెంకు చెందిన లచ్చ సాధు(95) ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబీకులను కూడా ఎమ్మెల్యే పరామర్శించారు. భూక్యా దేవానాయక్, లక్కినేని శ్యాం, లూనావత్ భద్రు, జోగ గోవర్ధన్, కోరం హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కావడం లేదు..

- విద్యార్థుల యూనిఫాం కుడితే రూ.50
- గుండీలు, జిప్పులు దారానికే రూ.28
- రూ.150 చెల్లించాలంటున్న మహిళా సంఘాలు
- నాలుగు కేంద్రాల్లో సిద్ధమవుతున్న యూనిఫాం



కుట్టిన యూనిఫాంలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాల్వంచరూరల్: సర్కారు స్కూళ్లలో చదువుకునే నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం అందజేస్తుంది. ఏడాదికి ఒక్కో విద్యార్థికి రెండు జతల డ్రస్‌లను అందజేస్తుండగా వీటిని కుట్టించే బాధ్యతలను గతేడాది వరకు టెండర్ల ద్వారా టైలర్లకు అప్పగించేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి స్వయం సహాయక గ్రూపు మహిళలకు ఉపాధిని కల్పించాలనే సంకల్పంతో యూనిఫాంలను కుట్టించే బాధ్యతలను వీరికి అప్పగించింది. దీంతో పాల్వంచ మండలంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్, మున్సిపాలిటీలలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో మహిళా గ్రూపులకు 80 స్కూల్స్ విద్యార్థుల యూనిఫాం కుట్టించే బాధ్యతలను అప్పగించారు.

80 స్కూళ్లలోని ఐదువేల మంది విద్యార్థులకు....

పాల్వంచ మండల, పట్టణ పరిధిలో 80 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఐదువేల మంది విద్యార్థులు ఉండగా ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున మొత్తం 10వేల దుస్తులు కుట్టాల్సి ఉండగా మొదటి విడత కింద ఐదువేల యూనిఫాంలు కుట్టాల్సి ఉంది. మండల పరిధిలో 2,150 మొదటి విడత కింద కుట్టాల్సి ఉంది. మహిళా సంఘాల్లో కుట్టు శిక్షణ నైపుణ్యం కలిగిన 50 మందికి పైగా మహిళలను ఎంపిక చేశారు. పాల్వంచ పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో ఒక కేంద్రం, మండలంలోని సీతానగర్‌కాలనీ, జగన్నాథపురం, నాగారం, సుబ్బనపల్లి గ్రామాల్లో నాలుగు కేంద్రాల్లో యూనిఫాం కుట్టేలా ఏర్పాటు చేశారు.

ఒక యూనిఫాం కుడితే రూ.25పైగా ఖర్చు..

మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం అప్పగించిన యూనిఫాం కుట్టడం వలన లాభం రాకపోగా రోజు కూలి కూడా గిట్టుబాటు కావడం లేదని కుట్టే మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక యూనిఫాం కుట్టేందుకు ప్రభుత్వం చెల్లించే రూ.50 లోనే దారం, జిప్పులు, గుండీలను కొనుగోలు చేయాల్సి ఉంది. గుండీలకు రూ.5, జిప్పులకు రూ.5, దారానికి రూ.10, కటింగ్ కూలీ రూ.8 చొప్పున ఖర్చువుతుంది. ఇలా ఒక జత కుడితే రూ.28 ఖర్చువుతుంది. ఈ ఖర్చులు పోను మిగిలేది కేవలం రూ.22 మాత్రమే. రోజు మొత్తం శ్రమిస్తే ఐదు నుంచి ఆరు జతలు మాత్రమే కుట్టగలుగుతుమంటున్నారు. రోజంతా కష్టపడ్డా ఉపాధి కూలికి వచ్చినంత రావడం లేదంటున్నారు.

మార్కెట్‌లో జతకు రూ.300కు పైగానే...

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒక జత కుట్టాలంటే రూ.300 – 400 చొప్పున తీసుకుంటున్నారు. ఇలా రోజు ఒక్కటి, రెండు జతలు కుట్టిన అంతోఇంతో గిట్టుబాటు ఉంటుంది. అదే ప్రభుత్వం ఇచ్చిన దుస్తులను కుడితే కూలి గిట్టుబాటు కావడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



యూనిఫాం కుడుతున్న మహిళా సంఘాల సభ్యులు

2వ తేదీ డెడ్‌లైన్...

స్కూల్ యూనిఫాంలను జూన్ 2వ తేదీ నాటికి కుట్టి ఇవ్వాలని సంబంధిత అధికారులు డెడ్‌లైన్ విధించారు. దీంతో గడువు సమీపంచడంతో మహిళా సంఘాలు ఒప్పుకున్న దుస్తులను త్వరగా కుట్టి ఇవ్వాలని ఇతర కుట్టుమిషన్‌దారులతో కొన్నింటిని కుట్టిస్తున్నారు.

కుట్టుకూలి పెంచాలి..



స్కూల్ యూనిఫాంలు కుట్టేందుకు ప్రభుత్వం కేవలంరూ.50 చొప్పుల చెల్లిస్తామంటున్నారు. రోజంతా శ్రమించినా కూలి కావడం లేదు. బయట దుస్తులను కుడితే రూ.300 – 400పైనే ఇస్తున్నారు. ప్రభుత్వం ఆలోచించి ఒక్కో జతకు రూ.150 నుంచి 200 చొప్పున చెల్లించాలి.

– ఉమారాణి, మహిళా సంఘం సభ్యురాలు

జతకు రూ.28 ఖర్చవుతుంది..



స్కూల్ యూనిఫాం కుడితే ఖర్చు రూ.28 అవుతుంది. అధికారులు మాత్రం రూ.50 చొప్పున ఇస్తామంటున్నారు. అందులో ఖర్చులు పోను మిగిలేది కేవలం రూ.22 మాత్రమే. జత కుట్టడానికి రోజు సమయం పడుతుంది. అధికారులు ఆలోచించి జతకు కనీసం రూ.200 చెల్లించాలి.

– స్వాతి, మహిళా సంఘం సభ్యురాలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా...



విద్యార్థుల యూనిఫాంలను ఈసారి ప్రభుత్వం మహిళ సంఘాల సభ్యులతో కుట్టిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జతకు అన్ని ఖర్చులు కలిసి రూ.50 చెల్లించాలని నిర్ణయించారు. కొంతమంది డబ్బులు గిట్టుబాటు కావడం లేదంటున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– రాంబాబు, ఐకేపీ ఏపీఎం

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న భాస్కర్

టేకులపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను యుద్ధ ప్రాతిపదికన అమలు చేయాలని, రెండు లక్షల రుణమాఫీ, వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తానన్న హామీని అమలు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్కల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలు, ఎరువులు పురుగు మందులను మార్కెట్లోకి రాకుండా అరికట్టాలని, నాణ్యమైన మేలైన విత్తనాలను 75 శాతం సబ్సిడీపై రైతులకు సకాలంలో ప్రభుత్వమే నేరుగా అందజేయాలని కోరారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించి నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. రైతాంగ ఆత్మహత్యలను నివారించాలని రైతుబీమా పథకాలను అమలు చేసి రైతు సంక్షేమం కొరకు పాటు పడాలని విన్నవించారు. కార్యక్రమంలో ఉప్పరబోయిన రామ్మూర్తి, బానోతు ఊక్లా, సనప పోమ్మయ్య, కందగట్ల సురేందర్, బానోత్ రాంసింగ్, గిద్దెబోయిన రామచంద్రు, బానోత్ క్రాంతికుమార్, అజ్మీర భద్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం క్లాత్ పంపిణీ

జూలూరుపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం క్లాత్‌ను మంగళవారం సెంటర్ల ఇన్‌చార్జ్ టైలర్లకు విద్యాశాఖ మండల అధికారులు పంపిణీ చేశారు.

137 స్కూళ్లకు ఆయా సెంటర్ల ఇన్‌చార్జ్‌లకు అందజేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరుణాకర్ రెడ్డి, ఎంఈఓ జి.వెంకట్, మండల నోడల్ అధికారి సంజీవరావు, ఐకేపీ ఏపీఎం సత్యనారాయణరాజు, సీసీలు డి.నాగేశ్వరరావు, బి.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగ్గిన ఓటింగ్



ఇల్లెందులోని పోలింగ్ కేంద్రం వద్ద సందడి (ఫైల్)

ఇల్లెందు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈసారి ఓటర్లతో పాటు ఓటింగ్ శాతం కూడా తగ్గింది. 2021లో జరిగిన ఎన్నికల్లో ఇల్లెందు మండలంలోని 5,228 మంది ఓటర్లకు గాను 3,860 మంది ఓటు వేయగా 73.83 శాతం నమోదైంది. ఈసారి 4,314 మంది ఓటర్లకు 3,047 మందే ఓటు హక్కు వినియోగించుకోవడంతో 70.53 శాతానికి పరిమితమైంది. ఈసారి ఎక్కువ మంది మొదటి, రెండు, మూడో ప్రాధాన్యత ఓటు కూడా ఉపయోగించుకున్నట్లు ప్రచారం సాగుతోంది. మొదటి ప్రాధాన్యత ఓటును తమకు కావాల్సిన అభ్యర్థికి.. రెండు, మూడో ప్రాధాన్యత ఓటును ప్రధాన పార్టీల అభ్యర్థులకు వేసినట్లు సమాచారం. ఏదిఏమైనా ఎమ్మెల్సీ ఎన్నికలు సైతం జనరల్ ఎన్నికలను తలపించాయి. రాజకీయ పార్టీలు కూడా అదే తరహాలో సభలు, సమావేశాలు నిర్వహించాయి. అభ్యర్థులు, నాయకులు ప్రత్యక్షంగా ఓటర్లను కలిసి తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇక పోలింగ్ ముందు రోజే కాక పోలింగ్ రోజున బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఓటర్లకు తాయిలాలు అందజేసినట్లు ప్రచారం జరిగింది. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల నడుమ పోటీ ఉండగా.. స్వతంత్రులు కూడా కొందరు గట్టి పోటీ ఇచ్చినట్లు తెలుస్తుండగా విజయం ఎవరిని వరిస్తుందో వేచిచూడాల్సిందే.

టేకులపల్లి: వరంగల్–ఖమ్మం–నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సోమవారం టేకులపల్లి మండలంలో ప్రశాంతంగా జరిగింది. మండలంలో మొత్తం 70.11 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్ నాగభవానీ తెలిపారు. అయితే గ్రాడ్యుయేట్ మహిళలు 545 మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొనగా, పురుషులు 879 మంది అధికంగా ఓటు వేశారు. పలువురు యువతీ, యువకులు తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఘనంగా ఎన్‌టీఆర్ జయంతి

మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎన్‌టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ముద్ర వేసుకున్న నాయకుడు ఎన్టీ రామారావు అని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్‌లో...



ఇల్లెందు: ఆస్పత్రిలో పాలు, పండ్లు పంపిణీ

నాణ్యమైన విత్తనాలు అందించాలి



జూలూరుపాడు: తహసీల్‌లో వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

జూలూరుపాడు: రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ ధర్మా మాట్లాడుతూ... వానాకాలం సీజన్ ప్రారంభం కావొస్తున్నా వ్యవసాయశాఖ అధికారులు సాగుకు సంబంధించిన ప్రణాళికను తయారు చేయకపోవడం విచారకరమన్నారు. అన్నిరకాల విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై గానీ, ఎంఆర్‌పీకి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గుగులోత్ రామచంద్రు, లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్ పాల్గొన్నారు.

సుజాతనగర్: అఖిలభారత ప్రగతిశీల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రైతాంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం డివిజన్ కార్యదర్శి బానోత్ ధర్మా మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులకు విత్తనాలు, పురుగుమందులను ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుగులోత్ రామచంద్ర, లింగాల వీరభద్రం, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీసీల బలోపేతానికి కృషి చేద్దాం..

ఇల్లెందు: అత్యధిక జనాభా కలిగిన బీసీలు వర్గాలు, ముఠాలుగా విడిపోయిన వారందరినీ ఐక్యం చేసి బీసీలను బలోపేతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పీఏ ప్రసాద్, ఇల్లెందు పట్టణ అధ్యక్షుడు గోచికొండ సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 42శాతం బీసీలకు వాటా పొందాల్సిన అవసరం ఉందని, రాజ్యాధికారం కోసం పోరాటం సాగించాలని కోరారు. బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సమ్మయ్య, కె.రాజేందర్, గ్రంధి సదానందం మాట్లాడగా.. బీసీ నేతలు కుంటు ఐలయ్య, కందగట్ల భిక్షపతి, సింగు నాగేశ్వరరావు, భాస్కర్, గడ్డం రంజిత్, పోలు జయంత్, సత్యనారాయణ, వేలు రంజిత్‌కుమార్, కొండూరి సత్యనారాయణ, ప్రతాప్‌కుమార్ గౌడ్ బీసీ సంక్షేమ సంఘంలో చేరారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరిపించాలి

సింగరేణి(కొత్తగూడెం): భద్రాచలంలోని నర్సింగ్ కళాశాల విద్యార్థి కారుణ్య అనుమానస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అభిమన్యు, వీరభద్రం డిమాండ్ చేశారు. కొత్తగూడెంలో మంచికంటి భవన్‌లో మంగళవారం వారు మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం తప్పుడు వివరాలతో అనుమతి తీసుకుని ఒకే నంబర్‌తో మూడు కళాశాలలు నడిపిస్తోందని ఆరోపించారు. అలాగే, కళాశాలలో సరైన నిబంధనలు పాటించకపోగా అర్హులైన అధ్యాపకులు కూడా లేరని, ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తున్నా విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆయా అంశాలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని నాయకులు డిమాండ్ చేశారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి..



జీఎంతో చర్చిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఇల్లెందు: సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఏఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లెందులోని సింగరేణి జీఎం జాన్‌ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జాన్ ఆనంద్‌తో కలిసి సమస్యలపై చర్చించారు. జేకే ఓసీ, కేఓసీ, సీహెచ్‌పీ, ఆస్పత్రి, ఏరియా వర్క్‌షాప్‌లో నెలకొన్న సమస్యలను జీఎం దృష్టికి తెచ్చారు. అన్ని పనులు పూర్తి చేస్తామని జీఎం వారికి హామీ ఇచ్చారు. జీఎంను కలిసిన ఏఐటీయూసీ నేతలలో కె.సారయ్య, నజీర్ అహ్మద్, దాసరి రాజారామ్, గడదాసు నాగేశ్వరరావు, ముస్తాఫా, కొరిమి సుందర్, భూషణం, చాంద్ పాషా, జయరాజ్, అజ్మీరా కిషోర్, రంజిత్, శ్రీనివాస్, రామారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీదే విజయం

చుంచుపల్లి: కేంద్రంలో మరోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం తథ్యం అని, సోమవారం జరిగిన ఖమ్మం, నల్గొండ, వరంగల్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిదే విజయమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు జీవీకే మనోహర్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 75 రోజులుగా బీజేపీ కార్యకర్తలు, నాయకులు అవిశ్రాంతంగా పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేశారని వారికి పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పల్లె ప్రగతి పనులపై ఆరా

- గ్రామాల్లో కొనసాగుతున్న అధికారుల తనిఖీ
- నిర్లక్ష్యం.. నిరుపయోగంపై పరిశీలన
- వినియోగం తీరుతెన్నులపైనా దృష్టి



బొజ్జాయిగూడెంలో ఎరువు తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలోనూ పల్లెప్రగతి పథకంలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రధానంగా పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు, నర్సరీ, క్రీడా ప్రాంగణం, డంపింగ్ షెడ్డు తదితర పనుల కోసం పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేశారు. ఆయా అభివృద్ధి పనులు ప్రస్తుతం ఎలా ఉన్నాయి.. అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలు.. నిర్లక్ష్యానికి గురైన వాటి పరిస్థితి ఎలా ఉంది.. తదితర అంశాలను పరిశీలించి వాస్తవ పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా మండల, జిల్లా స్థాయి అధికారులు గ్రామాలలో పర్యటిస్తూ అభివృద్ధి పనులను తనిఖీ చేస్తున్నారు.

అసంపూర్తిగా కొన్ని.. మొక్కుబడిగా ఇంకొన్ని..

ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామపంచాయతీకి ఒకటి చొప్పున నిర్మించిన వైకుంఠధామాలు కొంత మేర ఉపయోగకరంగా ఉన్నా అసంపూర్తి పనులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అత్యధిక వైకుంఠధామాలలో నేటికీ విద్యుత్ సౌకర్యం అందుబాటులో లేదు. మరికొన్నిచోట్ల నీటి సౌకర్యంలేదు. ఫలితంగా ఆయా చోట్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక అట్టహాసంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. అదరాబాదరగా క్రీడామైదానాలకు స్థలాలను ఎంపిక చేసిన అధికారులు నేలను చదును చేయడం, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్ కోర్టులను సిద్ధం చేసిన అధికారులు వ్యాయామం కోసం ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. ఆయా చోట్ల స్థానిక క్రీడాకారులు సెలవు రోజుల్లో, సాయంత్రం వేళ ఆడుకునేలా క్రీడా సామాగ్రిని కూడా పంపిణీ చేసింది. కానీ నేటికీ ఏ ఒక్కచోటా క్రీడా సామాగ్రి క్రీడాకారుల చేతికి అందలేదు. కనీసం క్రీడా ప్రాంగణాలను వినియోగించిన దాఖలాలు కూడా లేకపోవడంతో అంతటా క్రీడా ప్రాంగణాలు రూపం కోల్పోయి అధ్వానంగా ఉన్నాయి.

ఆహ్లాదం దూరమై..

గ్రామపంచాయతీలలో ఆవాసానికి ఒకటి చొప్పున పల్లె ప్రకృతి వనాల ఎంతో ఆర్భాటంగా చేపట్టారు. కొంతకాలం ప్రజలకు అహ్లాదం పంచిన పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ కొరవడడం, దీనికి తోడు అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా ఎటూకాకుండా పోయాయి. పట్టణ పార్క్‌లను మరిపించేలా ప్రజలు సేదతీరడంతోపాటు సాయంత్రం వాకింగ్ చేసేలా, చిన్నారులు ఆడుకునేలా ఎంతో ఖర్చు చేసి సుందరంగా తీర్చిదిద్దారు. ఆ తరువాత అధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకొని పల్లెప్రకృతి వనాలలో పెద్దపెద్ద చెట్లు కనిపించాలని, చిట్టడవిని తలపించేలా మొక్కలు ఎదగాలని ఆదేశించడంతో అప్పటి వరకు సుందరంగా తీర్చిదిద్దిన పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగే మొక్కలను నాటారు. దీంతో ప్రకృతి వనాలలోకి ప్రజలు వెళ్లే పరిస్థితి లేక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రారంభంలో ఉద్దేశించిన లక్ష్యానికి పల్లె ప్రకృతి వనాలు దూరంగా ఉండిపోయాయి.

ఎరువు తయారీ నామమాత్రం...

గ్రామాలలో ఇంటింటా ట్రాక్టర్ల సహాయంతో సేకరించిన చెత్తను డంప్‌షెడ్డుకు తరలించడం పల్లెప్రగతిలో ప్రారంభించారు. ఇలా సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరుచేసి తడిచెత్తను ప్రత్యేక నిర్మాణాలలో ఎరువుగా తయారు చేయడం ప్రారంభించారు. దీనికోసం ప్రతీ గ్రామపంచాయతీలోనూ ప్రత్యేకంగా సిబ్బందిని కూడా నియమించారు. ప్రారంభంలో ఈ ప్రక్రియ సవ్యంగా సాగినప్పటికీ క్రమంగా నిర్లక్ష్యానికి గురైంది. వాస్తవంగా ఈ ప్రక్రియ ద్వారా తయారయ్యే ఎరువును కొంతమేర నర్సరీలు, పల్లె ప్రకతి వనాలలో వినియోగించినా ఎంతోకొంత విక్రయించడానికి అవకాశం ఉంటుంది. కానీ ఎక్కడా విక్రయించి గ్రామపంచాయతీకి ఆదాయం సమకూర్చిన దాఖలాలు లేవు.

తనిఖీ చేస్తున్నారిలా..

మండలంలోని 29 గ్రామపంచాయతీలలో నాలుగింట్లో డీపీఓ, డీఎల్‌పీఓ, మిగతా 25 పంచాయతీలను ఎంపీఓ తనిఖీ చేసేలా ఉన్నతాధికారులు ఆదేశించారు. వారం రోజులుగా గ్రామాలలో తనిఖీలను ముమ్మరం చేశారు. పల్లె ప్రకృతి వనాలలో నాటిన మొక్కలు ఎలా ఉన్నాయి. బతికినవి ఎన్ని.. వాటికి నీటితడులు సక్రమంగా అందిస్తున్నారా.. వైకుంఠధామంలలో సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. క్రీడా ప్రాంగణాలు ఎలా ఉన్నాయి.. సామగ్రిని క్రీడాకారులకు అందిస్తున్నారా.. నిర్వహణ ఎలా ఉంది.. డంపింగ్ షెడ్డులలో ఎరువు తయారీ ఎలా ఉంది. నర్సరీలలో మొక్కలు ఎంత మేర పెంచుతున్నారు.. వాటి నిర్వహణ ఎలా ఉంది. తదతర అంశాలను పరిశీలించి నివేదికలను సిద్ధం చేస్తున్నారు.



ముత్తారపుకట్టలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ చిరంజీవి

పరిశీలిస్తున్నాం...



గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతిలో భాగంగా చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి స్వయంగా పరిశీలిస్తున్నాం. వాటి వినియోగం, నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తున్నాం. గ్రామ పంచాయతీల వారీగా పల్లె ప్రగతి పనుల ప్రస్తుత వాస్తవ పరిస్థితిని నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– చిరంజీవి, మండల పంచాయతీ అధికారి, ఇల్లెందు